క్లుప్తంగా

వసతిగృహ సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వసతిగృహంలో సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఎంవీ ప్రసాదరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ప్రారంభం కానున్న టైప్–4 వసతిగృహంలో హెడ్‌కుక్–1, అసిస్టెంట్ కుక్–1, స్కావెంజర్–1, స్వీపర్–1, నైట్‌వాచర్–1 పోస్టుల కోసం మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఈ నెల 15వ తేదీలోగా ఎంఈవో కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


రామారావునాయుడు (ఫైల్)

వంగర: మాజీ సర్పంచ్ బొత్స రామారావునాయుడు(77) శుక్రవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వంగరలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 25 ఏళ్ల పాటు ఆయన సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, గ్రామస్తులకు విశేషమైన సేవలందించారు. ఆయన మృతి పట్ల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సంతాపం ప్రకటించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాపై కసరత్తు


ఓటర్ల వివరాల సేకరణలో ఎంఆర్ఐ జగదాంబ, సీఈవో ప్రతాప్

బాడంగి: సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మండలంలోని సాగునీటి చెరువుల ఆయకట్టు రైతు ఓటర్ల వివరాల సేకరణలో రెవెన్యూ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. గ్రామపెద్దలను సంప్రదించి, పాత ఓటర్ల జాబితాలోని వారు ఎవరైనా చనిపోయారా లేదా అనే విషయం ఆరాతీస్తున్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే తెలియజేయాలని కోరుతున్నారు.

బొబ్బిలి కోటలో ఆయుధ పూజ


ఆయుధాలకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి: రాజుల కోటలో ఆయుధ పూజ శుక్రవారం నిర్వహించారు. ప్రతిఏటా దసరా పండగ ముందురోజు ఈ పూజ నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. మాజీ మంత్రి ఆర్‌వీఎస్‌కే రంగారావు, ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన)లు ఈ కార్యక్రమానికి హాజరై, కోటలోని పాత ఆయుధాలు, యుద్ధ సామగ్రికి పూజలు చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

లోన్‌యాప్‌ల్లో అప్పులు చేయొద్దు

రేగిడి: లోన్‌యాప్‌ల ద్వారా డబ్బులు అప్పు తీసుకోవద్దని సచివాలయ మహిళా పోలీసులు ప్రజలకు సూచించారు. మండలంలోని 25 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులంతా అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గ్రామాల్లో శుక్రవారం పర్యటించి, లోన్‌యాప్‌లు, వాటిలో రుణాలు వాడడం ద్వారా కలిగే కష్టాలపై అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ(రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా) గుర్తింపు పొందని ఆన్‌లైన్ లోన్‌యాప్‌లను చాలామంది తమ స్మార్ట్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని, అప్పులు చేస్తున్నారని, వాటిని మళ్లీ తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మోసపూరిత యాప్‌లను నమ్మితే నష్టాలు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు


చిన్నారులకు పెట్టిన భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలోని బొమ్మినాయుడువలస పంచాయతీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తహసీల్దారు ఎస్‌కే రాజు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పౌష్టికాహార సరుకుల నిల్వలు, పంపిణీపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి, పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం



విద్యుత్ అలంకరణలో నవదుర్గామాత ఆలయం, (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న నవదుర్గామాత

- నేడే విజయదశమి వేడుకలు
- పూజలందుకోనున్న నవదుర్గామాత
- దీక్షలు చెల్లించనున్న వేలాదిమంది భవానీభక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

రాజాం/రాజాం సిటీ: ఉత్తరాంధ్రలోనే విశిష్ట దేవాలయంగా పేరొందిన రాజాంలోని శ్రీనవదుర్గామాత ఆలయం విజయదశమి వేడుకలకు సిద్ధమైంది. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గత ఎనిమిది రోజులుగా ఆలయంలో విశేషపూజలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. శనివారం విజయదశమి సందర్భంగా మందిరంలో కొలువుదీరిన తొమ్మిది దుర్గామాతల విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేపడతారు. గర్భగుడిలో కొలువైన దుర్గామాత నిజరూపదర్శనం భక్తులకు కలగనుంది. మూలవిరాట్‌గా ప్రతిష్ఠించిన దుర్గాదేవి ప్రతిమను ఊరేగించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షకులు శ్యామలరావు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

హిమాలయ పర్వతాల వద్ద జ్వాలాముఖికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నవదుర్గామాత ఆలయాన్ని తలపించేలా ఇక్కడి పాతబస్టాండ్ ఆవరణలోని నవదుర్గామాత ఆలయ నిర్మాణం చేపట్టారు. ప్రతి ఏటా మాదిరిగానే దసరా ఉత్సవాల్లో భాగంగా గత తొమ్మిది రోజులుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విజయదశమి అనంతరం హోమం నిర్వహించి, ఇరుముడులు సేకరిస్తారు. ఆదివారం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

41 రోజుల మండల దీక్షలు..

విజయదశమి సందర్భంగా 41 రోజుల మండల దీక్షలు భవానీ భక్తులు చేపట్టారు. నియోజకవర్గంలో 3 వేల మంది భక్తులు ఈ ఏడాది దీక్షల్లో ఉన్నారు. వారంతా ఇరుముడులతో ఇక్కడకు చేరుకోనున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి, హోమగుండంలో ఇరుముడులు వేస్తారు. ఇరుముడి చెల్లింపు కార్యక్రమ సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయంలో కూడా ఇరుముడి కార్యక్రమం ఉంటుంది.

ఆయుధ పూజ..

ఇదిలా ఉండగా, నవదుర్గా ఆలయంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకుని, ఆలయ ఆవరణలో భారీగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణ అంతా విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతోంది. కొత్తగా వాహనం కొనుగోలు చేసిన వారితో పాటు వాహనదారులంతా తమ వాహనాలను ఆలయం వద్దకు తీసుకువచ్చి, ఆయుధ పూజ నిర్వహించనున్నారు. వందలాది కొత్త వాహనాలతో పాటు వేలాది పాత వాహనాలను యజమానులు వెంట తీసుకువచ్చి, ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు ఆర్.శ్రీనివాస శర్మ తెలిపారు.


దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో వేసిన పౌరాణిక నాటకం

మహిషాసురమర్దినిగా దుర్గాదేవి


తెర్లాం: మహిషాసురమర్దినిగా దుర్గాదేవి


రాజాం సిటీ: రాజాం మల్లికార్జున స్వామి ఆలయంలో శాకంబరీ దేవిగా చౌడేశ్వరి అమ్మవారు


రేగిడి: లక్ష్మీపురంలో పూజలందుకుంటున్న దుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి మహిషాసురమర్దినిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. శనివారం విజయదశమి కావడంతో భక్తుల పూజలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఆలయాలు, మండపాల వద్ద ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల చేపడుతున్న పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– బొబ్బిలి, రాజాం


రామభద్రపురం: సాయినగర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు దంపతులు


బొబ్బిలిరూరల్: అలజంగిలో దుర్గాదేవి మండపం వద్ద భక్తుల కుంకుమపూజలు

నేడే విజయదశమి పూజలు

బాడంగి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయదశమి పూజలకు మండలంలోని ఆలయాలు, దుర్గాదేవి మండపాలు సిద్ధమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొంటున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. దసరా సందర్భంగా గజరాయునివలస గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఎడ్ల పరుగుపందెం, ముగ్గుల పోటీలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు సమాచారం.

ప్రజలకు దసరా శుభాకాంక్షలు


మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాదేవి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని, నిత్యం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. శాంతియుత వాతావరణంలో సరదాగా పండగ జరుపుకోవాలని కోరారు.


డాక్టర్ తలే రాజేష్

రాజాం: నియోజకవర్గ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. నియోజకవర్గ ప్రజలపై దుర్గాదేవి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, నిత్యం సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని కోరారు.

మహాన్నదానం

రాజాం సిటీ: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డోలపేటలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో మహాన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డోలపేట వాసులతో పాటు పరిసర గ్రామాలైన పొనుగుటివలస, బుచ్చెంపేట, బాలకవివలస, మునకలవలస తదితర గ్రామాల నుంచి దాదాపు 4 వేలకు పైగా భక్తులు హాజరై, అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

బె'ధర'గొడుతున్నాయి..

రామభద్రపురం: కూరగాయల ధరలు వినియోగదారులను బెదరగొడుతున్నాయి. నిత్యవసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో సామాన్య ప్రజలపై పెనుభారం పడింది. నిన్నటి మొన్నటి వరకు రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.40 కాగా ఇప్పుడు ఏకంగా రూ.100 చేరుకోవడం గమనార్హం. మిగతా కూరగాయల ధరలు కూడా ఇదే మాదిరి ఉన్నాయని, ఏ ఒక్కటీ రూ.60లకు తక్కువ లేదని ప్రజలు వాపోతున్నారు.


రామభద్రపురం మార్కెట్‌లో విక్రయిస్తున్న కూరగాయలు

ఆడబిడ్డల భద్రత అందరి బాధ్యత


తెర్లాంలో ర్యాలీలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, తదితరులు


బొబ్బిలిరూరల్: అలజంగిలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీ

అంతర్జాతీయ బాలికా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించి, బాలికల హక్కులు, సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆడబిడ్డల భద్రత అందరి బాధ్యత అని, ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అని నినాదాలు చేశారు. ఆడపిల్లలే దేశానికి గర్వకారణమని, ఆడపిల్లలను గౌరవించాలని, చిన్నచూపు చూడొద్దని కోరారు. స్వేచ్ఛగా వారిని ఎదగనిస్తేనే వారి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోగలరని వక్తలు తెలిపారు.

– బొబ్బిలిరూరల్, తెర్లాం, రాజాంసిటీ, రేగిడి


బొబ్బిలిరూరల్: కాశిందొరవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


రాజాం సిటీ: రాజాంలోని మల్లిఖార్జునకాలనీలో ర్యాలీ


రేగిడి: వన్నలి అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం!


సంకిలి ఓపెన్ హెడ్ చానల్ వద్ద కర్రల సాయంతో షట్టర్లు నిలబెడుతున్న రైతులు

- వరదలకు కొట్టుకుపోయిన సంకిలి ఓపెన్ హెడ్ చానల్ షట్టర్లు
- సాగునీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రేగిడి: అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. సాగునీరు అందించడంలో అధికారుల తీవ్రజాప్యం కారణంగా పంటపొలాలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని సంకిలి గ్రామ సమీపంలోని మురికిగెడ్డ ఓపెన్ హెడ్ చానల్(కాలువ) వద్ద చాలా ఏళ్ల క్రితం నిర్మించిన షట్టర్లు వరదనీటికి కొట్టుకుపోయాయి. ప్రస్తుతం వాటిని బాగు చేయకపోవడంతో పంటపొలాలకు అందాల్సిన సాగునీరు అందడం లేదు. ఈ షట్టర్ల ద్వారానే నాగావళి నది నీరు కాలువ వచ్చేది. అక్కడి నుంచి పంటపొలాలకు సాగునీరు సరఫరా అయ్యేది. అయితే కొట్టుకుపోయిన షట్టర్ల తలుపుల స్థానంలో రైతులు శుక్రవారం తాత్కాలిక ఏర్పాట్లు చేసి, కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందేలా చేసుకున్నారు. సంకిలి, పుర్లి, దేవుదళ, ఖండ్యాం, కొమెర, వెంకటాపురం, మంగళాపేట, ఆడవరం, లక్ష్మీపురం గ్రామాల రైతులంతా శ్రమదానం చేసి మరీ కర్రలతో అడ్డుకట్ట వేసి, షట్టర్లను తాత్కాలికంగా నిర్మించుకున్నారు. దాదాపు 11 వేల ఎకరాలకు పైగా భూములకు ఈ ఓపెన్ హెడ్ చానల్ ద్వారానే సాగునీరు అందాల్సి ఉండగా, అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా ఈ కాలువ షట్టర్లు బాగుచేయాలని రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు విజ్ఞప్తి చేస్తున్నారు.

పలుపత్ర ద్రావణంతో పంటలు బాగు

రాజాం: పలుపత్ర ద్రావణంతో పంటలు బాగా పండి, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ టి.అరుణ, ఎల్‌వన్ పి.రమాదేవిలు అన్నారు. మండలంలోని కొఠారిపురం గ్రామంలో పలుపత్ర ద్రావణం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామంలో విరివిగా లభించే వేప, జిల్లేడు, కానుగ, సీతాఫలం, కుంకుడు, మందార, కలబంద, తులసి, చింత, మునగ, బొప్పాయి, నేపియర్ గడ్డి, అత్తాకోడల్లాకు, వెదురు, జామ, గోంగూర, ఉమ్మెత్త, గన్నేరు వంటి 18 రకాల పత్రాలను సేకరించి, వాటితో పత్రద్రావణం తయారు చేసి, వాటి వినియోగం, ప్రయోజనాలను వివరించారు. పలుపత్ర ద్రావణం పంటపై పిచికారీ చేయడం ద్వారా తెగుళ్లు, చీడపీడలు సోకకుండా ఉంటాయని, ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ సత్యవతి, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రాజాం: పలుపత్ర ద్రావణం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది


రేగిడి: అంబఖండిలో చేపలపత్ర ద్రావణం తయారు చేస్తున్న దృశ్యం


రేగిడి: చాటాయవలసలో అగ్నిఅస్త్రం తయారు చేసి చూస్తున్న సిబ్బంది

చేపలపత్ర ద్రావణం తయారీ..

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామ రైతులకు చేపలపత్ర ద్రావణం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 సురేష్ తొలుత ద్రావణం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, దాని ప్రయోజనాలను తెలిపారు. పది రకాల ఆకులను రెండు కిలోల చొప్పున తీసుకుని, వాటిని 200 లీటర్ల నీటిలో వేసి, దానికి పది లీటర్ల ఆవుమూత్రం కలిపి నలభైరోజుల పాటు నిల్వచేయాలన్నారు. అనంతరం పులిసిన ద్రావణాన్ని వరిపంటపై పిచికారీ చేస్తే తెగుళ్లు, చీడపీడలు సోకవన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

మండలంలోని చాటాయవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ పురుగుమందులకు బదులుగా అగ్నిఅస్త్రాన్ని పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. కిలో పొగాకు, అరకిలో వెల్లుల్లి, అరకిలో పచ్చిమిర్చి, ఐదు కిలోల వేపాకులను ఓ మట్టికుండలో వేసి, దానిలో పది లీటర్ల ఆవుమూత్రం వేసి బాగా కలపాలన్నారు. ఆ తర్వాత పలచని గుడ్డలో వడకట్టి, తయారైన అగ్నిఅస్త్రాన్ని ఓ డబ్బాలో వేసుకుని, మూడు నెలల వరకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఎకరా విస్తీర్ణంలోని పంటకు ఐదు లీటర్ల అగ్నిఅస్త్రం పిచికారీ చేస్తే చాలు అని తెలిపారు. సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.